"...నేనెవరిని"

శ్రీ మేకా సుధాకరరావు

ఆ పెట్టెలోనికి ఎవరు ఎక్కుతున్నారో, ఎవరు దిగిపోతున్నారో అతనికి అవసరంలేదు. కిటికీ దగ్గర ఒంటరి సీటులో కూర్చుని, అలా శూన్యంలోకి చూస్తున్నాడు రఘు. తన జీవితపు స్మృతి తరంగాలలో ఉక్కిరి బిక్కిరవుతున్న అతని కనులు అశ్రుధారలైనాయి! ఆలోచనలతో అంతకంతకు భారతరమైపోతున్న అతన్ని మోయడం కష్టంగా వున్నదున్నట్టు, క్రిక్కిరిసి వ్రేళ్లాడుతున్న జనంతో రైలు నడవలేక నడుస్తోంది. సుందరమైన సరస్సులవంటి అతని కళ్ళలోని నిరాశా, నిస్పృహా గమనించిన కనులు ఎవరివైనా చెమ్మగిలక మానవు! రైలు ఆగినా నడచినా అతని ఆలోచనలూ అశ్రుధారలూ సాగుతూనే ఉన్నాయి. రాత్రి తొమ్మిదిన్నరకు తాను అనకాపల్లిలో ఎక్కిన రైలు అప్పుడే అన్నవరం వచ్చిన విషయం అతనికి తెలియదు.

తాను 'కౌముది'ని కోరి పెళ్లి చేసుకోవడం - ఆ సందర్భంగా తనను ఎంతో ప్రేమతో పెంచిన తనకు పూజ్యులైన తలిదండ్రులను సైతం కాదనవలసి రావడం - అయితే, తమ పుత్రుని సౌఖ్య సంతోషాలే ప్రధానమని భావించి వారు కౌముదితో తన వివాహానికి సమ్మతించి వైభవంగా జరిపించడం, ఆదిగాగల తన జీవితవాహిని, చలనచిత్రంలోవలె తన మనోనేత్రం ముందు పరుగు పెడుతూంది:

"కౌముది! ఎంత చక్కని పేరు!" అనుకున్నాడు తొలిసారిగా ఆమె పేరు విన్నపుడు. ఆమెలోని వినయం, వివేకం, చురుకుదనం చక్కని అలవాట్లూ అతన్ని ఆకర్షించాయి. తనకు అటువంటి సుందరి జీవిత సహచరిగా లభిస్తే జీవితంలో ఇక ఆశించతగ్గదేదీ ఉండదని ఊహించాడు. ఆమెకోసం కలలు కన్నాడు-పలవరించాడు. అదృష్టం కలసివచ్చి ఆమెయే తన అర్ధాంగయింది.

అయితే, ఆమె ఇప్పుడు లేదు! అయిదేళ్లుమించి ఆమెతో వుండే అదృష్టం తనకు లేకుండా పోయింది. ఆ అయిదేళ్లూ తన జీవితానికి అయిదు యుగాల ఆనందం! మరపురాని, మరవలేని మధురానుభవం. ఆమె తన జీవితం అంధకారంచేసి, నాలుగేళ్లై విడిచిపోయినా, తన మనసు మాత్రం ఆమె తలపును మరచి ఉండలేదు.

అప్పటికే దీర్ఘ అనారోగ్యంతో వున్న తనతండ్రి, తన పెళ్ళయిన సంవత్సరంలోనే పోయేడు. మరో రెండు సంవత్సరాలకు తల్లి మరణించింది. ఇక తనకు కౌముదితప్ప కావలసిన వారెవ్వరూ లేరు. అత్తమామలకు ఉన్నంతవరకూ ఎంతగానో సేవలు చేసింది కౌముది. "మాకు కూతురు లేకపోయిన కొరత తీర్చేవు కోడలా" అంటూ ఆనందం వెలిబుచ్చుకుంది ఆ అత్త. అన్యోన్యంగా, అనుకూలంగా ఆనందంగా సాగిపోయింది దాంపత్యం. భోజనం దగ్గర తల్లిని మరపించేది కౌముది. రాత్రి పూట తను ఎప్పుడైనా కాస్త ఎక్కువసేపు చదువుతూంటే చాలు-ఆ పుస్తకం లాక్కుని 'అబ్బ-ఎంత టైమయిందో! మళ్ళీ ప్రొద్దుటే లేవాలా? మధ్యాహ్నం విశ్రాంతి లేదు' అంటూ వారించేది. ఈనాడు తానేమైపోతే ఎవరికి కావాలి? నిజానికి ఆమె పోయినప్పట్నుంచీ సుఖనిద్రకు మొహం వాచిపోయాడు తాను.

బ్రహ్మముహూర్తానే లేచి స్నానాదులు ముగించుకుని, ప్రార్థనలో కూర్చునేది కౌముది. పూజగదిలోనుండి బయటకు రావడంతోనే కాఫీ ఫలహారాలు తయారుచేయడం - ఈ లోపులో తనను లేపి, స్నానాదులకు అమర్చి, తన పూజకు పూలవీ సిద్ధం చేసేది. అన్నీ చకచకా చేసేసేది. తను బయటకు వచ్చేసరికి కాఫీ టిఫిన్లు ఎదురు చూస్తుండేవి. తను కాలేజీ టైమయ్యేవరకూ పాఠాలు సిద్ధం చేసుకోవడం, ఆమె తనకు వంట సిద్ధం చేయడం-అలా చక్కని జీవిత విధానానికి అలవాటుపడడానికి తనకెంతగానో సహకరించింది కౌముది-సహచరించింది.

ఆమె పోయిన తరువాత తన జీవితవిధానమే మారిపోయింది. ఆ ఆరోగ్యకరమైన అలవాట్లే తప్పిపోయినాయి. కౌముది పోగానే తన జీవితం ఎంత శూన్యమైపోయింది! కలలా కరిగిపోయినా, ఆమెతో తన జీవితంలోని కొన్ని సంఘటనలు ఎన్ని జన్మలకూ మరిచిపోలేడు:

తాను టైఫాయిడ్ జ్వరం పడ్డపుడు, తన కౌముది రోగంతో పోరాడి తనను తేలదీసుకుంది. ఆ ఇరవై రోజులూ తన చెంతనే వుంటూ, కావలసిన మందులూ, ఆహారం సకాలంలో యిస్తూ సపర్యలు చేసింది. ఎప్పుడు తినేదో ఏం

చేసేదో, తను మెలకువగా వున్నపుడు ఎప్పుడు చూసినా, ప్రక్కనే విసురుతూనో, తల పడుతూనో వుండేది. ఆమె సేవలకు అచ్చెరువొందిన డాక్టరు కూడ, తాను తేరుకున్నాక ఒకసారి తనతో, "నీవు ఇంత త్వరలో తేరుకోడానికి నా తెలివి తేటలు కాదు రఘూ కారణం - నీ అదృష్టదేవత, ఆమె. నిండు మనసుతో ఆమె చేసిన సేవలు" అన్నాడు.

ఆ సందర్భంగా మందులకూ వాటికీ డబ్బు కావలసివచ్చి, తనకు చెపితే తన మనస్సుకు శ్రమ కలుగుతుందేమోనని, ఆ విషయం తనవరకూ రానీయకుండా, మెడలోని నెక్లసు తాకట్టు పెట్టి డబ్బు తెప్పించి, ఖరీదైన మందులూ బలమైన ఆహారం చేకూర్చింది. తాను మామూలు జీవితంలో పడ్డాక చెప్పింది, ఆ తాకట్టు విషయం. "అలా ఎందుకు చేశావు! నీ మెడ బోసిగా ఉంచుకున్నావా - నేను చూడనేలేదు" అని, తానంటే, మెడ బోసిగా వుంటేనేం? నా మనసు నిండుగా వుంది - మనమే విడి పించుకుంటాం" అంటూ, అతి తేలికగా సముదాయించేసింది తనను. ఆ కౌముది ఈనాడు తనకు లేదు!

* * *

వెన్నెల సన్నజాజులు కురుస్తున్న చల్లని తెల్లని రాత్రి. వాకిట్లో సురభిళాలు వెదజల్లుతూన్న మల్లిపందిరి దగ్గరగా తెల్లని మెత్తని శయ్యపై తాను. పక్కన కూర్చుని తమలపాకులు రాస్తున్న తన కౌముది. సినిమానుంచి తిరిగివచ్చి అప్పుడే భోజనం చేశాడు. కౌముదిని తీసుకెళ్ళకుండా తాను స్నేహితులతో సినిమాకు వెళ్ళినందుకు, రాగానే ఆమెకు కారణం వివరించాడు. కాని అది ఆమెను తృప్తిపరచినట్టు లేదు. తనూ ఆమెకు బాధ కలిగించేననే భావించాడు. చెప్పకుండా ఉండివుంటే అది వెరు. కాని ఆ రోజు సినిమాకు వెడదాం సిద్ధంగా వుండమని చెప్పి వెళ్లేడామెతో. ఆమె ఎంతో ఉత్సాహంతో ఎదురుచూచింది. తమలపాకులందిస్తూన్న ఆమెతో అన్నాడు, "నీకు ఆశాభంగం చేసినందుకు బాధపడుతున్నాను కౌముదీ" అని.

"బాధపడడం దేనికి - తెలిసుండి చేసిన పనే కదా—" అన్నదామె, ఉడుకుమోతుతనాన్ని వెల్లడి గాకుండా వాల్చిన ముఖంతో—

"అదేంవిటి కౌముదీ- వాళ్లెంత పట్టుబట్టారో చెప్పేనుగా- లేకపోతే...." తానింకా ఏదో చెప్పబోయాడు.

"ఎవరైతేనేం - నీకు నాకన్న ముఖ్యమైనవాళ్ల - వాళ్ళను సంతోషపెట్టేవుగా-నా మాటకేం...." చెప్పుతున్నట్టుగా మనసులో బాధను ఇక అణుచుకోలేనివిధాన అన్నది.

నిజమే - తాను ఇలా ఆమె ఆశను భంగపరచడం ఇది మొదటిసారి కాదు. ఇదివరలో ఒకసారి ఇలానే జరిగింది. తన కౌముది మనసుకింత బాధ కలిగించానన్న ఆలోచన సోకినంతనే అతని కళ్ళు చెమ్మగిలినాయి! అధరాలు వణకజొచ్చాయి. ఆకులు అందిస్తున్న ఆమె చేతిపై వెచ్చని కన్నీటిబొట్టు రాలి, ఆమె హృదయం 'చుర్ ర్'మంది! తృళ్ళిపడింది తన కౌముది! చల్లని మృదువైన వేళ్ళతో తన రెండు కళ్లూ తడిమింది! "రఘూ! నన్ను క్షమించు రఘూ! బాధపడుతున్నావా - నీకింత బాధ కలుగు తుందనుకోలేదు-" అంటూ, కొంగుతో తన ముఖం తుడిచి, తన హృదయంపై వాలిపోయింది. అంతవరకూ తనలో అణగివున్న దుఃఖం దిగమింగలేకపోయాడు తాను - చంటిపిల్లవానిలా వెక్కి వెక్కి ఏడ్చాడు! కన్నీరు ధారగా కురిసింది! ఆమె దెబ్బతిన్న లేడిలా బెదిరిపోయింది. శరీరమంతా కంపించిపోయింది. "రఘూ, ఇంకెప్పుడూ నిన్ను ఏమీ అనను - నన్ను క్షమించు. నీ హృదయపు సౌన్నిత్యాన్ని బాధపడితే నేను భరించలేను - నా గుండె పగిలిపోతుంది" అంటూ ముఖం తన హృదయంలో దాచుకుని దుఃఖించింది. అంతా కొద్ది నిమిషాలు. తుఫానులో నావలా రెపరెపలాడిపోయినాయి వారి హృదయాలు. ఆ సంఘటన తరువాత ఎప్పుడూ, మాటవరసకైనా ఏ విషయంలోనూ తనను నొప్పించలేదు. ఆ మధురానుభం తన స్మృతిపథంలో వీచినపుడు అతనిలోని బాధ అధికమై కన్నీరు కట్టలు తెంచుకుని పొరలింది. ఆ కౌముది తనకు లేకుండా పోయింది గదా అని కృంగిపోయాడు. 'నేనెవరికోసం జీవించాలి?' అన్నంత విరక్తి పొందేడు!

రైలు సామర్లకోటలో ఆగటంకాని, మళ్ళీ బయలుదేరటం కాని అతనికి తెలియదు. అలా కన్నీటిలోనే, కలతలోనే ఉండి పోయాడు.

రఘు ఆలోచనాస్రవంతి కౌముదితో తన జీవితపు ఆఖరి సంవత్సరంలో ప్రవేశించింది :

కాలేజినుంచి ఇంటికి వస్తూ తోవలో పచ్చరటిపళ్ల ద్రాక్ష పళ్లూ కొని తీసుకువచ్చాడు తాను. ద్రాక్షపళ్లు చూసి ఆనందపడి పోయింది కౌముది. గబగబా విప్పి ముఖం పుల్లగా చిట్లించు కుంటూ, ఆప్యాయంగా తింటూ, "ఎక్కడైనా మామిడికాయలు దొరికితే తీసుకోండి - రేపు పప్పులో వేసుకుందాం" అంది. "ఇప్పుడు మామిడికాయలా!" ఆశ్చర్యంగా చూస్తూ అడిగేడు తను. కౌముది ఆ ద్రాక్షపళ్లు తింటున్నతీరూ, ప్రొద్దుట చింతకాయ పచ్చడి చేయడం, ఇప్పుడు మామిడికాయలు అడగటం తలుచుకునే సరికి తనలో ఒక ఊహ మెరుపులా మెరిసింది. "ఏమిటి కథ"

అంటూ, కొంటెగా ఒకసారి ఆమెను ఆపాదమస్తకం పరికించి చూచాడు. ఏదో చెప్పలేని సిగ్గు వెదజల్లుతూ, ఒళ్లు కప్పేసుకుని చటుక్కున తిరిగి, "స్నానానికి నీళ్ళు తోడిపేస్తాను" అని, తన సమక్షం తప్పించుకుపోయింది.

ఆ మర్నాడే కౌముదిని లేడీడాక్టరుకు చూపించాడు. తన కౌముది రెండు మూడు నెలల తల్లి! వెంటనే వాళ్ళమ్మకు ఉత్తరం రాయడం ఆవిడ రావడం జరిగింది. మూడోనెల వచ్చింది కనుక కూతుర్ని తీసుకువెడతానంది, ఆమె. అమ్మో - కౌముదిని విడిచి ఉండడమే!" భయపడ్డాడు తాను.

"అదెలా కుదురుతుందమ్మా-ఆయనకు భోజనమదీ ఎలాగ? ఒకరోజా రెండురోజులా?" రఘుని ఉండలేని కారణం మధ్యపెట్టి తెలివిగా తప్పించుకుంది కౌముది.

"అవునండత్తగారూ-ఇక్కడ లేడీడాక్టరు దగ్గర మందులు వాడుతున్నాం" అంటూ, తానూ తప్పించుకున్నాడు. మొత్తానికి ఏడో మాసంలో తీసుకువెళ్ళడానికి నిర్ణయించి ఆమెను పంపేశారు.

ఆ రోజుకారోజు తన కౌముదిలో మార్పు చూసుకుంటూ మురిసిపోతున్నాడు తాను. ఆమె గర్భంలోని శిశువుతోపాటు, ఇన్ని నెలలూ తన హృదంతరాళంలో ఆశలు పెరుగుతున్నాయి!

తన కొడుకు ఎంతో అందంగా ఉంటాడు - ఎవరికీ లేని అందమైన పేరు పెట్టాలి-చిన్న వయసులోనే పెద్ద విద్యావంతుణ్ణి చేయాలి-మంచి సాహితీపరుడూ సజ్జనుడూ కావాలి - సంఘంలో ఘనమైన కీర్తి, స్థానం పొందాలి - వాడి ఔన్నత్యంతో తనకూ తన వంశానికీ శాశ్వతమైన కీర్తి రావాలి.... ఇలా ఏవేవో ఆశలూ ఆశయాలూ పెరిగిపోతున్నాయి తనలో!

ఒకనాడు చటుక్కున "మనకు ఆడపిల్ల పుడితే ఏం పేరు పెడదాం" అని ఆనందంగా అడిగింది కౌముది. "ఎక్కడా లేని చక్కని పేరు పెడదాం" అన్నాడు. అన్నాడేకాని, ఆడపిల్ల విషయం ఇంతవరకూ ఊహించనేలేదు తాను. కౌముది ప్రశ్న మూలంగా ఇప్పుడీప్రశ్న తలెత్తింది—

తన కూతురు అచ్చు తల్లి పోలికనుంటుంది - చిన్నప్పట్నుంచీ సంగీతం నృత్యం నేర్పించి అందరూ మెచ్చుకునేలా పెంచాలి - మహిళాలోకానికే మణిపూసలా తీర్చిదిద్దాలి-దేశంలో ప్రముఖమైన స్థానం అలంకరిస్తుంది తన కూతురు!.... ఆ ఆలోచనలకు ఆశలకూ అంతులేదు.

ఏడోనెల వచ్చేక కౌముదిని తీసుకెళ్ళడానికి వాళ్ళమ్మ వచ్చింది. కౌముదీ తానూ పరస్పరం విడిచి ఉండలేరు. ఇద్దరూ కలిసికట్టుగా, "ఆ గ్రామంలో వైద్యసదుపాయం ఉండదనీ, మొదట్నుంచీ చూస్తున్న లేడీడాక్టరు ఇక్కడవుంది గనుక పురుడు ఆమె దగ్గర పోసుకోవడం క్షేమకరమనీ" ఆమెకు నచ్చజెప్పి పంపేశారు.

ఆ రోజు చంద్రగ్రహణం. ఇరుగు పొరుగువాళ్లు చెప్పిన మీదట కౌముది కదలకుండా మంచంమీద పడుకుని ఉంది. బయటనుంచి వస్తూనే, ఆమె కనపడని కారణాన 'కౌముదీ' అంటూ పిలుస్తూ గదిలో ప్రవేశించాడు తను. "ఏం అలా పడుకున్నావు - ఒంట్లో బాగాలేదా?" అంటూ ఆత్రుతగా అడిగేడు. "అబ్బే ఏమీలేదు - ఇప్పుడు గ్రహణం కదూ - గర్భిణీ స్త్రీలు కదలకూడదు - మరో గంట పోయేక, మామూలే" అంది. "చంపేశావు - అంతేకదా" అంటూ తాను బయటకు వెళ్ళబోతున్నాడు. "రఘూ, రఘూ!" అంటూ ఆందోళన పడుతున్నట్టు కేక పెట్టింది. చటుక్కున వెనుకకు చూశాడు. చేతులు చాచిన ఆమెవైపు రెండడుగులు వేశాడు. తనని బాహుబంధంలో చిక్కించుకుని, "ఆ రాహువు బహు చెడ్డవాడు - నీ వదన బింబాన్ని చూచి చంద్రుడని మ్రింగినా.... ఏమో బాబు - నీవు బయటకు కదలవద్దు-" అంటూ తనతోపాటు మంచానికి కట్టేసింది. ఆ ప్రేమా, ఆ శృంగార చతురతే తలుచుకుంటే తన హృదయం తరుక్కుపోతూందీనాడు!

కౌముదికి ప్రసవవేదన ప్రారంభమయింది. ఆ బాధ తను చూచి భరించలేడు. వాళ్ళమ్మకూడా వచ్చి దగ్గిరే వుంది. లేడీ డాక్టరు చాలాసేపటినుంచి అక్కడే ఉండిపోయింది. కాన్పు కష్టంగా గోచరించి మరో డాక్టర్ని కూడా సహాయం తీసుకు వచ్చింది. ప్రసవం చాలా శ్రమయింది. శిశువు ప్రాణంతో బైట పడింది. అయితే తన కౌముదికి స్పృహలేదు! ముద్దుబిడ్డను చూచుకోనేలేదు! తాను చూచాడు. కాని తన మనసు మనసులో లేదు - తన కౌముదిమీదనే నిలిచిపోయింది. ఇద్దరు డాక్టర్లూ చేయవలసినదంతా చేశారు. కౌముది బ్రతుకుతుందనే ఆశించారు- అయితే రెండురోజుల అనంతరం వారి ఆశ నిరాశై పోయింది. తను పిచ్చివాడై పోయాడు. కౌముదిపైబడి బోరున ఏడ్చాడు.... అంతా తాను ఊహించనివిధాన జరిగిపోయింది!

తన జీవితం తుత్తునియలై పోయింది. ఆరని శోకంతో కంటికీమంటికీ ఏకధారగా కన్నీరు కురుస్తూ, నిద్రాహారాలు లేక సొక్కి సోలిపోయాడు. కౌముది అక్క శకుంతల వచ్చి ఉంది.

ఆ చంటిగుడ్డును ఆవిడే చూస్తూంది. తరువాత ఆమె భర్త కూడా వచ్చేడు. కర్మకాండ అంతా పూర్తయింది. తనొక్కణ్ణీ విడిచి ఎవరింటికి వారు వెళ్ళిపోయే రోజు—

తన అత్తగారూ, వదినెగారూ, మిగతా బంధువులూ కలసి తనకేవేవో నచ్చజెప్పేరు. తన చిట్టితల్లి శకుంతల దగ్గర పెరుగుతుంది. తానెప్పుడు కావాలంటే అప్పుడు చూడవచ్చు – 'సరే' అని పంపివేయడానికి అంగీకరించాడు. అందరూ వెళ్ళిపోయారు. తానొంటరియై పోయాడు. తన ఆలోచనలన్నీ కౌముదే ఆక్రమించుకుంది.

రెండేళ్ళయింది తన పాపను చూచి. ఈపాటికి ముచ్చటగా పరుగెడుతూ పడుతూ లేస్తూ ఉంటుంది. అచ్చు వాళ్ళమ్మ పోలికేనని రాసింది, శకుంతల. పుట్టినరోజుకని మంచి గౌన్లవీ తీసుకుని వెళ్ళాడు. చిట్టిని చూడగానే తన మనస్సు ఉప్పొంగిపోయింది! అచ్చు వాళ్ళమ్మ పోలికే - కౌముదిని తన చిట్టితల్లిలో చూచుకుంటూ బ్రతకగలననుకున్నాడు. అయితే, తనను చూడగానే భయపడిపోయినట్టు పారిపోయింది! శకుంతల తీసుకువచ్చి "ఎవరే చిట్టీ" అంటూ తనను చూపితే, "చిన్న-నాన్న" అంటూ నట్టుతూ పలికింది, తన ప్రాణం చివుక్కుమంది!

రాత్రి బండికి తిరిగి ఇంటికి బయలుదేరాడు, రఘు. మళ్ళీ తన చిట్టితల్లి "టా-టా-చిన్న నాన్నా" అంది. తన హృదయం చితకపొడిచినట్టయింది! "నేను చిన్న నాన్ననా! నా కన్నతల్లికి నేను చిన్న నాన్ననా! నాన్న అనిపించుకునే అదృష్టమే లేదా నాకు! నా కౌముదితోపాటు నా కన్న కూతురు కూడా నాకు లేకుండా పోయినట్టేనా!" అనుకుంటూ, స్టేషనుకువచ్చి రైలులో కూలబడ్డాడు—

సాగిపోతున్న రైలుతో తన ఊహలు సాగుతున్నాయి. "నేనెవరిని? నా చిట్టితల్లికి నేనెవరిని!" ఆలోచనలలో, గత జీవితపు జ్ఞాపకాల ఊహలలో, కన్నీటిలో, అలా ఉండిపోయాడు!

రైలు కూతకూసి మళ్ళీ కదిలిపోయేవరకూ తాను దిగవలసిన రాజమండ్రి వచ్చేసినట్టే తెలియదు!!

కాంక్ష

శ్రీ తిరునగరి

అందాల అడవుల్లో చెట్లనీడల్లో కూచొని
పద్యాలు రాసుకోవాలని ఉంది
సంధ్యవేళల్లో నదీతీరాల్లో నించొని
గీతాలు పాడుకోవాలని ఉంది
చల్లగాలులు శరీరాన్ని స్పృశించగా
సంసార బాధల్ని మరచిపోవాలని ఉంది
తీయని ప్రకృతి లాలనలో
గాయాల్నీ మరచిపోవాలని ఉంది
ఈర్ష్యాద్వేషాలలౌకిక జగత్తుకి దూరంగా
ఏకాంతంగా అక్షరజగత్తులో విహరించాలని ఉంది
కమ్మని భావాలు హృదయంలో ఉదయించగా
రసలోకాల్లో తేలిపోవాలని ఉంది
అందాల అడవుల్లో చెట్లనీడల్లో కూచొని
అక్షర కవిత్వం రాసుకోవాలని ఉంది
సంధ్యవేళల్లో నదీతీరాల్లో నించొని
అమృతగీతం పాడుకోవాలని ఉంది
నాకు
రసలోకాల్లో
తేలిపోవాలని ఉంది.